కామదహనం

ప్రతి మానవుడి బీరువాలోనూ ఒక అస్తిపంజరం దాగివుంటుందట! వినడమేగాని నేనెప్పుడూ కళ్ళతో చూడలేదు. పుస్తకాలు, బట్టలు, నగలు మరేదైనా విలువైన వస్తువు బీరువాల్లో వుండడం నేనెరుగుదును. ఐనా బీరువాదాకా వెళ్ళడం ఎందుకు! అస్తిపంజరం మానవుడి శరీరంలో వుంటుందని నాకు నికరంగా తెలుసు.

కానీ మనిషితో వ్యవహరిస్తున్నప్పుడు ఆ వ్యక్తి శరీరంలో ఒక అస్తిపంజరం వుందన్న భావం మనలో లేశమాత్రంగానైనా వుండదు. చెవుల్ని శ్రీకారాలంటాం. కళ్ళు కమలాలంటాం. నాసికను నువ్వు పువ్వంటాం. పెదవులు దొండపండంటాం. కంఠం శంఖమంటాం. కాని అస్తిపంజరం జోలికి వెళ్ళము. నేను బల్లగుద్ది చెప్పగలను? ఏ ఎక్స్‌రే ద్వారానయినా ప్రియురాలి అస్తిపంజరాన్ని ఫొటోతీసి చూపిస్తే, అసహ్యించుకోకుండా వుండగలిగే ప్రేమికుడుండడు!

రహస్యాలు అస్తిపంజరాలలాంటివేమోనని నా అనుమానం.

వికృతమైన అస్తిపంజరాన్ని స్నిగ్ధసుందరమైన శరీరంలో దాచుకున్నట్టుగా, ప్రతి మానవుడు తన నాగరిక ప్రవర్తనకు, సభ్యతాయుతమైన సంస్కారానికి వెనుక కొన్ని వ్యక్తిగత రహస్యాలు దాచుకుని వుంటాడనా నా ఊహ (కాకపోతే అపోహ).

రహస్యాలు పెద్దవీకావచ్చు, చిన్నవీ కావచ్చు. లోకంలో ఖూనీలు జరుగుతున్నాయి. దొంగతనాలు దోపిడీలు జరుగుతున్నాయి. చట్టవిరుద్ధమైన వెయ్యి దురాగతాల్లో శిక్షాస్మృతికి దొరికే వెన్ని? తప్పించుకునేవెన్ని? ఇలా తప్పించుకున్న దుర్భయాలన్నీ స్వంత బీరువాలాంటి మనసులోపలి మూలగదిలో రహస్యాలుగా నిక్షిప్తమై వుండిపోతున్నాయి. అగ్నిసాక్షిగా పెళ్లాడిన ధర్మపత్ని సైతం ఆ మూలగదిలోనికి తొంగిచూడ్డానికి వీలులేని కేసులున్నాయి. పోనీ పెద్ద రహస్యాల సంగతి వదిలేద్దాం. కొన్ని చిన్న రహస్యాలుంటాయి. ఇవి బహిర్గతం కావడం అంత అపాయకరమేమీకాదు. కాని యిదొక ప్రతిష్ఠకు సంబంధించిన వ్యవహారంలాగా యిలాంటి రహస్యాలను పదిలపరచుకోవడం రివాజు. ఒక పెద్ద మనిషి వున్నాడు. అతడు గుట్టు చప్పుడుగాకుండా మట్టిబెడ్డలు మింగేస్తుంటాడు. ఆ పని చేయకుండా ఉండనూలేడు. తనలా చేస్తున్న విషయం లోకానికి తెలిస్తే ఆ నామోషీతనాన్ని భరించనూలేడు. మట్టిబెడ్డలు ఖాద్య పదార్థాల కోవకు చెందినవి కావు. వాటిని మెసపడం లోకుల దృష్టిలో అపహాస్య కారణం. అందువల్ల యిదొక రహస్య క్రియగా నిర్వహింపబడడం సబబే! కానీ ఉత్తపుణ్యానికి కొందరు బుద్ధిమంతులు చాలా మామూలు విషయాలకుకూడా రహస్యపు బురఖాలు తగిలించేస్తుంటారు. ఒక సిగరెట్టు కాల్చడమే తీసుకుందాం. సంఘంలో ఫ్రమ్ టాప్ టు బాటం– ఈ పని చాలామంది చేస్తున్నదే! కాని ఒక్కొక్క వ్యక్తి సిగరెట్లతోనూ అగ్గిపెట్టెతోనూ పురబాహ్య ప్రదేశానికి చిత్తగించి, అక్కడ వరుసగా పది సిగరెట్లు మసిచేసి దారిలో రెండు కిళ్లీలు సేవించి యింటికి తిరిగివస్తూ ఈ ధూమ సేవా వినోదాన్ని దొంగనోట్లు అచ్చువేసేటంత రహస్యంగా కొనసాగిస్తుంటాడు. మరికొందరికి యింగ్లీషు సినిమాలకు వెళ్లడంకూడా రహస్యమే. అంతెందుకూ. ఇలస్ట్రేటెడ్ వీక్లీలో "చందమామ" నుంచుకుని రహస్యంగా చదువుకునే పయోధికుల్ని నేనెరుగుదును.

కానీ మా చలపతి జీవితంలో రహస్యాలు దాగివుండవచ్చునని నేనెన్నడూ అనుకోలేదు. చలపతి నాకు బంధువుకాదు, మిత్రుడు. బాగా కలిగిన కుటుంబం. స్వస్థలంలోనే మంచి ఉద్యోగం. వయస్సులో, నాకన్నా ఏడెనిమిదేళ్లు చిన్నవాడు. మా కిద్దరికీ లంకె కలిపిన విచిత్ర వస్తువు సాహిత్యం. నేను మంచి పుస్తకాల చిరునామాలు మాత్రమే సేకరించేవాణ్ణి! వాటిని కొనగలిగే అర్థబలమూ, ఆసక్తీ రెండూ వున్నాయి చలపతికి. చదివిన పుస్తకం పైన అభిప్రాయాలు చెప్పుకోడానికొక శ్రోత కావాలి. నాలాంటి వాళ్ళు కనిపిస్తే చలపతికి జన్మజన్మాల బంధువులే కనిపించినట్లు: కావలిస్తే ఆఫీసుకు సెలవుచీటీ అయినా పంపి తాను సాహిత్య ప్రసంగాల్లో మునిగి పోవడానికి తయారు. చలపతి ఊహలో సాహిత్య గోష్ఠి ఒక్కటే సత్కార్యం.

పాపం, అలాంటి చలపతికి ఒక్కొక్కప్పుడు సెలవు చీటీ పంపినా సెలవు దొరికేది కాదు. వీల్లేదు, పలానా అర్జంటు పనుంది, తప్పకుండా ఆఫీసుకు హాజరు కావలసిందే నంటూ జవాను కబురు తెచ్చేవాడు. అలాంటి పరిస్థితిలో చూచి తీరవలసిందే చలపతి ముఖం. నెల జీతానికి పాలుమారి, ఒడలని కుర్చీకమ్ముకునే దురవస్థ శత్రువుకైనా వద్దుబాబూ అన్నదే ఆ ముఖ భంగిమకు వ్యాఖ్యానం. కానీ ఉద్యోగం పురుష లక్షణంగాదా! వదలుకుంటే మళ్ళీ దొరికేది గనుకనా! అందువల్ల భుక్తిమీద వలపు, బ్రాహ్యంబుతో పొత్తు అన్నట్లుగా యిటు సాహిత్యమూ, అటు ఉద్యోగమూ రెండూ వదలకుండా పట్టేసుకున్నాయి చలపతిని. నువ్వు గదిలో కూచుని హాయిగా చదువుకుంటూ వుండు గోపాలం. నేనా ఆఫీసు ఫైళ్ళ అరణ్యంలోనుంచీ అయిదింటికే వచ్చేస్తానులే...” అంటూ వెళ్ళిపోయేవాడు.

చలపతి ఆంతరంగికాగారంలో ఏకాంతంగా గడిపే అవకాశం నాకా విధంగా లభించింది.

“కాదంబరి కావాలన్నావుగదూ. ఆ పెట్టెలో వుంది తీసుకో. మొన్న తెప్పించిన పుస్తకాలు ఆ అలమారాల్లో వున్నాయి చూడు...” వ్యవధి లేకపోవడంవల్ల పుస్తకాల ఆచూకీ మాత్రం చెప్పి ఆదరాబాదరా వెళ్ళిపోతుండేవాడు చలపతి.

ఆ గదిలో పెట్టెలున్నాయి. అలమారాలున్నాయి. వాటి నిండుకూ పుస్తకాలే వున్నాయి. ఆ పుస్తకాలకూ, నాకూ తలుపులు, తాళాలూ అడ్డుగా లేవు. అందువల్ల కావడానికది చిన్నగదే అయినా నాకొక సామ్రాజ్యంలా వుండేది.

కానీ, ఎంతటి సామ్రాజ్యంలోనైనా జన జీవనానికి ఉపయుక్తంగాని ఎడారులు, శుష్క పర్వతాలు కొన్ని వుండకపోవు. సరిగ్గా నా పాలిటి కలాంటిదే ఒక బీరువా ఆ గదిలో వుంది. అది చలపతి స్వంత బీరువా. విధిగా దానికొక తాళం వ్రేలాడుతుంటుంది. తాళంతీసి బీరువాలోంచి చలపతి దుస్తులు తీసుకోడం నేనొకటి రెండుసార్లు చూచాను. పుస్తకాలు గాకపోయిన తర్వాత అందులో ఎలాంటి నిధి నిక్షేపాలున్నా ఆ సంగతి నా కనవసరం, ఆ బీరువా నాకెందుకూ కొరగాని ఒక వస్తు విశేషం.

కానీ ఉన్నట్లుండి ఒకనాడు నేనా బీరువాను గురించిన ఊహను మార్చుకోవలసి వచ్చింది. ఆఫీసుకు వెళ్లే తొందరలో చలపతి దానికి చిలుకువేసి తాళం తగిలించడం

మరిచిపోయాడు. పైన ఫాన్‌కూడా ఆన్ చేశానేమో, బీరువా తలుపులు మెల్లగా ఒకటి రెండంగుళాల మేరకు తెరుచుకున్నాయి. ఎలాంటి రహస్య ప్రదేశంలో దాచిపెట్టినా పుస్తకాలను పసిగట్టే అతీంద్రియ శక్తి ఒకటి నాకుందని నాకో నమ్మకం వుంది. ఆ విశ్వాసాన్ని వమ్ముచేసిన ఘనత మా చలపతికొక్కడికే దక్కింది. తలుపు తెరచి చూద్దును సరిగదా, బీరువాలో ఒక అరనిండుకు నన్ను వెక్కిరిస్తున్నట్లుగా పుస్తకాలే కనిపించాయి. వార, పక్ష, మాస పత్రికలు పుస్తకాలన్న వర్గీకరణం క్రిందికి వస్తాయోరావో నాకు తెలియదు. ఆ పుస్తకాల్లో ముప్పాతికా మువ్వీసంవంతు పత్రికలే. ఓ పత్రికను పైకి తీశాను. ముఖచిత్రంకేసి చూచాను. ఎవతో పాపం లేజవ్వని! నేను జాలిపడడం ఆవిడ సరైన తిండిలేక చిక్కిపోయి వుందని కాదు, ఆ యాస్పెక్ట్‌లో ఆమె సర్వాంగసుందరంగా వుంది. నూటికి నూరు మార్కులు నిలబెట్టి వసూలుచేయగల అంగసౌష్టవం ఆమెది! కాని తిండి తర్వాత మనిషికి బట్ట ప్రధానం గదా! ముఖ చిత్ర సుందరి ఒంటిపైన మూరెడు బట్టయినా లేకపోవడమే విధి వైపరీత్యం! పెంచి, పెద్దచేసిన కన్న బిడ్డను దిసమొలగా వీథులవెంట పడదానికి సమ్మతించే తండ్రి లోకంలో ఉంటాడా! ఉన్నాడు. ఈ ముఖచిత్ర సుందరిని సృష్టించిన చిత్రకారుడు చేసిన పని అది! కన్నుదోయికి అన్యకాంతలడ్డమైతే మాతృభావం చేసి మరలడం ఎవరికో మానవోత్తములకే సాధ్యమనుకుందాం. కానీ ఎంత మానవమాత్రులకైనా దిశమొలగా ఒక ఆడదిగాని, లేదా మగవాడుగానీ ఎదురైతే కళ్ళు మూసుకోవాలనే అనిపిస్తుంది. కాని నేనొకటి రెండు నిముషాలు అనిమిష నేత్రాలతో ఆ బొమ్మవైపు చూచాను. అంతసేపలా చూడగలిగానంటే అందుకు కారణం నా చుట్టుపట్ల ఎవ్వరూ లేకపోవడం! హఠాత్తుగా నాకో సత్యం తెలిసింది. పదిమందితో కలిసి వున్నప్పుడు చేయలేని పనులు కొన్నింటిని మనం ఏకాంతంలో చేయగలమన్నమాట! ఆ ముఖచిత్రం లోని జవ్వనికూడా ఎక్కడో ఏ బాత్‌రూంలోనో, పడకగదిలోనో యిలా వుండివుంటుంది. అందుకని ఆమెను పట్టి తెచ్చి యిలా ముఖపత్రం పైకెక్కించి బజారుపాలు చేయడం ఏం న్యాయం? ఐనా ఈ ముఖచిత్రం మీమాంసలోనే కొట్టుమిట్టాడుతూ కూచుంటే ఈ పత్రికను ఆద్యంతంగా చదివి చూడడమెప్పుడు?

గబగబా పుటలు తిరగవేశాను. ఆ పత్రికలో కథలకన్నా బొమ్మలే ఎక్కువ. పేజీకొక బొమ్మ. ప్రతి బొమ్మలోనూ ఒక కొమ్మ. ఆ కొమ్మకొక పురుషవృషభుడు అంటిపెట్టుకుని వుండడం తప్పనిసరి. ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం అంటాడు అభ్యుదయ కవి. ఇందులో ఏ బొమ్మను ఏ కొమ్మను చూచినా కళ్ళకు కొట్టవచ్చినట్లుగా కనిపించేది బట్టల కొరత భయానక స్వరూపమే! మానవులు దిగంబరంగా సంచరించడం పదివేల సంవత్సరాల క్రిందటిమాట. ఇప్పుడలా అంత ధైర్యంగా దిగంబరులుగా తిరిగేవాళ్ళు లేకపోయినా, ఆ వాంఛ మాత్రం ఏ కొందరిలోనో వున్నట్టే వుంది – ఈ బొమ్మల తీరుతెన్నుల్నిబట్టి చూస్తే! ఈ హావభావ విలాసాలు, ఈ ఆలింగ చుంబనాదులు ఈ శృంగార క్రీడలు లోకంలో లేనివికావు. కాని పట్టెమంచం పడక గదిలోనే వుండాలి. స్త్రీ పురుషులు లోపలికి వెళ్ళగానే తలుపులు మూసి వేయబడాలి. ఎవరి శృంగార జగత్తువారిదిగా ఆ రహఃకేళీ రహస్యాలు వాళ్లకు, వాళ్ల పడక గోడలకే పరిమితం కావాలి.

అలా కాకుండా పట్టె మంచాన్ని తీసుకొచ్చి యిలా పబ్లిగ్గా నాలుగు రోడ్ల కూడలిలో వేసుకుంటారా ఎవరైనా! అందునా నాగరికత అత్యున్నత శిఖరాలను అందుకుంటున్నట్లుగా భావింపబడుతున్న ఆధునిక సమాజంలో జరగవలసిన పనేనా యిది?

ఎందుకైనా మంచిదని నేనా పత్రికలోని కథల్నికూడా చదవదలచుకున్నాను. శ్రద్ధగా ఐదారు కథల్ని చదివి ముగించిన తర్వాతనే ఊపిరి త్రిప్పుకున్నాను. ఈ రచనల్లో లేనిదీ, వున్నదీ కూడా ఒక్కటే! లేనిది వైవిధ్యం, ఉన్నది సంభోగ శృంగారం. నదులన్నీ సముద్రానికభిముఖంగా పరుగెత్తినట్లుగా ఈ కథలోని సంఘటనలకన్నింటికీ చరమలక్ష్యం సంభోగ శృంగారం. ఇందులోనూ ఒక తమాషా. ఈ కథలనుబట్టి చూస్తే భార్యాభర్తల మధ్య శృంగారం తన విశ్వరూపాన్ని ధరించే వీలేలేదు. విటీవిటుల మధ్యన అది సాధ్యం. ఈ విటీవిటులలో కూడా ఎంత వయో తారతమ్యముంటే అంత మంచిది. సహజ పరిణామాలకన్నా ఆకస్మిక, యాదృచ్ఛిక సంఘటనలకే ప్రాధాన్యం. భార్యాభర్తలు పడకగదిలోనే కలుసుకుంటే అది వట్టి చప్పకథ. స్త్రీ పురుషులు (ఇంతకుమునుపు ముఖమెరుగని వాళ్లయితే ప్రశస్తం) ఏ సినిమా థియేటరులోనో, రైల్వే స్టేషనులోనో కలుసుకుంటే ఆ కథ అక్కడితో రసకందాయంలో పడినట్లు. ఈ కథలోని మగవాడి నిఘంటువులో కులాంగన, సౌశీల్యం, పాతివ్రత్యంలాంటి పదాలు మచ్చుకైనా కనిపింపవు. (అతగాడు సాధారణంగా ఒంటరిగా ఓ గదిలో వుంటాడు. చుట్టుపట్ల గాలాలు వేస్తాడు) లోకం లోకమంతా వేశ్యావాటికగానే భావిస్తాడు. అందుకు తగ్గవాళ్లే ఆడమనుషులుకూడా! వాళ్లు శరీరాన్ని గుడి అనుకోరు. సత్రమనుకుంటారు. ఊర్వశిలా వావి వరుసల్ని లెక్కపెట్టరు. శూర్పణఖలా పరాయి మగవాణ్ణి ప్రథమ వీక్షణంలోనే కామిస్తారు. వరూధినిలా ఆ యింపే పరబ్రహ్మమనీ, అంతకంటే కావలిసిందేమీ లేదనీ అనేస్తారు. కానీ పైన పేర్కొన్న పురాణాంగనలకు తమ ప్రయత్నంలో కృతకృత్యత లభించినట్లు మనం వినలేదు. కానీ యిక్కడి ఊర్వశులకు, వరూధినులకు, శూర్పణఖలకు ఆ లోటు లేనేలేదు. అలాంటి మగవాళ్లు, ఇలాంటి ఆడవాళ్లే యిక్కడ హీరో హీరోయిన్లు.

బస్సుల్లోను రైళ్ళలోను కొందరు యువకులు ఇతరుల కంటపడకుండా జాగ్రత్తపడుతూ ఎంతో దీక్షగా పుస్తక పఠనంలో నిమగ్నులై కనిపించడం నాకప్పుడు జ్ఞప్తికి వచ్చింది. బస్సుల్లోకి రైళ్ళల్లోకి రాగలిగినవి యిండ్లలోకి దారిచేసుకోకపోతాయా? చదివినా అర్థంగాకపోవడానికి అవేమైనా ప్రబంధాలా? అక్షరం తెలిసిన ప్రతి వ్యక్తికీ యిది అందుబాటులో వున్న సాహిత్యమే!

తరచుగా యిలాంటి అవకాశాలు లభించవు గనుక పనిలో పనిగా మరికొన్ని పత్రికలు చూచిగానీ నేను బీరువా మూసివేసే వుద్దేశంలో లేను. పానకంలో పుడకలా ఓ పత్రిక తిరగవేస్తుండగా అందులో ఒక ఉత్తరం కనిపించింది. కవరుపైన టైప్ చేయబడి వున్న చిరునామా చూడగానే ఏదో అనుమానం కలిగింది. అప్రయత్నంగానే కవరులోనుంచి కాగితం తీశాను. అది ఆ పత్రికవాళ్లు చలపతికి వ్రాసిన ఉత్తరం – "మీరు కోరినట్టు మీరచనలనన్నింటినీ "కామవర్ధన్" అన్న మారుపేరుతోనే ప్రచురించగలము. పోయిన నెల ప్రచురింపబడిన మీ కథ, "జవ్వని నవ్వింది" చాలా బాగుందని మా కార్యాలయానికి

వందలకొలది జాబులు వచ్చాయి. మా అభినందనలు స్వీకరించండి" – ఇలా పూర్తయింది ఉత్తరం. నా ఆలోచనకు మాత్రం ఆనకట్టపడినట్లే అయింది.

"బాల్యక్రీడలు కొన్నినాళ్ళు. భామా కుచాలింగనో పరిరభ్యన్నతి కొన్నిన్నాళ్ళు" అన్నారు. చలపతికి బాల్య క్రీడల వయస్సు దాటిపోయింది.

"మారుడు మనవాడుకాడు, ఆతడు
తన మామతో జతచేరినాడు"

అన్న విరహ వర్ణనలోని చందమామ కాలానికి చిహ్నం; ఈ న్యాయాన్ని బట్టి ఇది చలపతిలో కాముదు పుట్టి ప్రవర్ధమానం కావడానికి తగిన అదనే కానీ అమాయకుడిలా కనిపించే చలపతిలో కాముడింత భయానకంగా పుట్టాడా? ఇంత బీభత్సంగా వర్ధిల్లుతున్నాడా? కామం పొగరుబట్టిన గుర్రం. మంచి పగ్గం బిగించి అదుపులో పెట్టుకోకపోతే ఈ గుర్రం రథాన్ని ఏ గోతిలోనైనా తోసివేస్తుంది. పగ్గం తగిలించటంలో విలంబనం జరిగినకొద్దీ ప్రమాదమే!

పైకి తీసిన పత్రికలన్నింటినీ బీరువాలో భద్రపరిచి తలుపులు మూసేశాను.

పుస్తకంపైన నిలవడానికి బుద్ధి మొరాయించింది. గదిలో పచార్లు ప్రారంభించాను. మనసు పరిపరి విధాల పరుగిడుతోంది. శనిగ్రహం పట్టుకుంటే ఏడేళ్ళు వదలదట. ఇదివరకు చూసిన బొమ్మలు, కథలో వచ్చిన పాత్రలు, దృశ్యాలు ఎంతగా వద్దనుకున్నా మళ్ళీ మళ్ళీ మనసులోకి వస్తున్నాయి. అమ్మో, అందులో ఏదో మాదకద్రవ్యం వున్నట్టే వుంది. ఈ విషానికి విరుగుడేమో తెలియడంలేదు. కాసేపు వెలుపలికి వెళ్ళి వద్దామనుకున్నాను. హాల్లో వేంకటరామయ్యగారు కనిపించారు.

"రావయ్యా శేఖరం! ఐనా ఆ పుస్తకాల్లో ఏముందిగానీ కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకుందాం కూర్చో. నా కిన్నేళొచ్చాయిగదా, పట్టుమని ఒక పుస్తకం చదివి ఎరగను. న్యూస్ పేపరు మాత్రం ఎడిటర్ అండ్ ప్రింటర్‌దాకా చదివేస్తుంటాను. తీరిగ్గా వున్నప్పుడల్లా పడుకొని నిద్రపోవడమే నాపని. అంతగా నిద్రపట్టలేదనుకో, మాట్లాడుతూ కూర్చుంటాను. మాట్లాడ్డానికి మనుషులే వుండాలన్న పట్టింపులేదు. కుక్క, పిల్లి, ఎలుక ఏది కనిపిస్తే దానితో మాట్లాడేస్తుంటాను. ఈ పుస్తకాలు చదివే దుర్గుణం ఎలాగో మా చలపతికి ఒంటబట్టింది..."

దొరికిన అవకాశాన్ని జారవిడువకుండా "మరయితే తొందరగా పెళ్ళి చేసేస్తే దుర్గణం తగ్గుముఖం పట్టవచ్చును గదండీ!" అన్నాను.

"అయ్యో రాత! వాడికా ధ్యాస ఎక్కడిది నాయనా!" వంటగదిలోనుంచీ హాల్లోకి వస్తూ అందుకుంది శాంతమ్మ. "పెళ్ళి మాట ఎత్తితే చాలు తుర్రున పారిపోతాడు. మొన్నటికి మొన్న మా మాలతి పదిరోజులుండి పోయింది గదూ? మాలతంటే మా అన్నయ్య కూతురు. వీడికి దాన్నే చేసుకోబోతున్నాములే! అది పెరట్లోవుంటే వీడు వీధిలో! అది వీధిలో వుంటే వీడు పెరట్లో!..."

ఆడగాలి తాకిడికి అంతగా చెదిరిపోయే చలపతిలో బూతుకథలు వ్రాసే "కామవర్ధన్" దాగి వుండడం విచిత్రమే!

***

మారుపేరుతో చలపతి శృంగార సాహిత్యం సృష్టిస్తున్నాడని లోకానికి తెలియదు. తన ఊహాలోకపు యిష్టభోగ విహారాలను ప్రచ్ఛన్నంగా ఒక అజ్ఞాత పాఠకుడు గమనిస్తున్నాడని చలపతికి తెలియదు. తనలోకి కామవర్ధనుడు యథేచ్ఛాప్రణయలీలల్లో తేలిపోవడంలో పరమానందం పొందుతుండగా నిజజీవితంలో చలపతి ఆ ఆనందానుభవాన్ని చూరగొనడానికి వీలుగా ఒక సంఘటన జరిగింది.

ముసుగులో గుద్దులాట లెందుకు - ఆ సంఘటన పేరే పెళ్ళి!

పెళ్ళికోసం చలపతి రెండు మాసాలు సెలవు పెట్టాడు.

చలపతికి నలుగురు అక్కచెల్లెళ్ళున్నారు. మాలతీ దంపతులు తమ హనీమూన్ కాలంలో ఒక్కొక్క ఆడపడుచు యింట్లో ఒక్కొక్క వారం గడపవలసి వచ్చింది. మిగిలిన పది పదిహేను రోజుల్లోనూ వాళ్లు శ్రీరంగం, శివసముద్రం, బెంగుళూరు, బృందావన్‌లాంటి రమణీయ ప్రదేశాలు సందర్శిస్తూ ముచ్చటగా చక్కర్లు కొట్టివచ్చారు.

హనీమూన్ ఆనందంగా గడిచినట్లు తాను మళ్ళీ ఉద్యోగంలో జాయినైనట్లుగా వ్రాశాడు చలపతి.

పత్రికలో ఒకటి రెండు మాసాలుగా కామవర్ధన్ కథ లేనందుకు ఒక పాఠకుడు విచారాన్ని వెలిబుచ్చుతూ వ్రాసిన ఉత్తరాన్ని "లేఖావళి" శీర్షికలో చూచాను. కామవర్ధన్ సెలవులో వున్నాడని ఆ పాఠకుడికి తెలియదు. నేనైనా అతడు కాస్త లాంగ్ లీవు పెట్టివుంటాడని మాత్రమే అనుకున్నాను.

ఆ పాఠకుడూ, నేనూ కూడా పొరబడ్డామని తెలుసుకోడానికి కొంతకాలం పట్టింది. నిజం నిలకడమీదనే గదా తెలిసేది!

చలపతికి పెళ్ళి జరిగి ఒక ఏడాది గడచిన తర్వాత నేనొక పర్యాయం ఆ వూరు వెళ్ళాను. ఆలోగా నాలుగైదుసార్లు వెళ్ళి రాకపోలేదు. కానీ ఆ వెళ్ళడం సంగతి వేరు! అప్పట్లో నేను నిక్కీ నీలిగీ హాల్లోకి మాత్రం వెళ్ళగలిగాను. స్వాగతం, సత్కారం, విందూ, విశ్రాంతి అన్నీ హాల్లోనే స్వీకరించాను. మిత్రుడి ఆంతరంగికాగారం భార్యాభర్తల శయనాగారంలా మారిపోవడమే యిందుకు కారణం. కానీ ఏడాది గడిచేసరికి పరిస్థితుల్లో కాస్త మార్పు వచ్చిందనే చెప్పాలి. కానుపుకోసం చలపతి భార్య పుట్టింటికి వెళ్ళిపోయిందట.

"హాల్లో కూర్చుంటే నిన్ను నేను చదువుకోనిస్తానా శేఖరం! వద్దు బాబూ! నువ్వు గదిలోనే కూర్చో" అన్నారు వెంకటరామయ్యగారు.

ప్రస్తుత విశేషం! చలపతి జంకుగొంకులు లేకుండా బీరువా తెరిచేస్తున్నాడు. బెరుకు బెరుకుగానే నేనా బీరువా అరలన్నీ పరకాయించి చూచాను. ఆడవాళ్ళ బట్టలు, స్నో సీసాలు, పౌడరు డబ్బాలు మొదలైన వస్తువులు కొన్ని కొత్తగా చోటు చేసుకున్న మాట నిజమేగాని ఆ బీరువాలో యిప్పుడు మచ్చుకొక అచ్చు కాగితమైనా కానరావడం లేదు!

సాయంకాలపు చల్లటి గాలికోసం ఊరిబయటకు షికారువెళ్ళి అక్కడొక చెరువుగట్టున కూర్చున్నాము. చలపతిని ఆశ్చర్యంలో ముంచి లేవనెత్తడానికి అదే తగిన

సమయమనిపించింది. "చూడు చలపతీ ఒక మాట అడుగుతాను. తటపటాయించకుండా జవాబు చెబుతావు గదూ" అన్నాను.

"ఏమిటో అడుగు..." మరింత నింపాదిగానే అన్నాడు చలపతి.

"మరేం లేదు "కామవర్ధన్" అంటూ ఓ రచయిత వుండేవాడు. ఒక ఏడాదినుంచీ అయిపులేకుండా మాయమయ్యాడు. అతడి ఆచూకీ నీకు తెలిసివుండాలి..."

ఒక క్షణంపాటు నా ముఖంలోకి తీక్షణంగా చూచి ఆ తరువాత విరగబడి నవ్వసాగాడు చలపతి. "ఆచూకీ తెలియకపోతే పోలీసులకు రిపోర్టివ్వలేకపోయావా రాజశేఖరం! ఎలా తెలిసింది బాబూ నీకు కామవర్ధన్‌ని గురించి? వాడికి దేవిడీమన్నా అయిందిలే. ఇక తిరిగిరాడు..."

నాకొక విషయం తెలిసింది. రహస్యం తెలిసిందిగదా అని చలపతిని లోకువ పరచడానికి వీల్లేదు. కొండంత ఆశ్చర్యాన్ని దిగమ్రింగి, తిరగబడినవాడితో మరింత సున్నితంగానే వ్యవహరించాలి. అందుకని అప్పటికప్పుడు ఒక అబద్ధాన్ని ఆసరాగా తీసుకున్నాను.

"అబ్బే, యిందులో పెద్ద ఇన్‌వెస్టిగేష నేముందోయ్ చలపతీ! కాళ్ళూ చేతులూ ముక్కూ మొగములాంటి అవయవాలన్నీ ఒక్కటే అయినా వాటి కలయికవల్ల ఏర్పడే ఆకృతుల్లో అనంతమైన వైవిధ్యం కనిపించడంలేదా. లోకంలో లక్షమంది రచయితలున్నారు. కానీ ఎవరి శైలి వాడిది. నా దగ్గర నువ్వు వ్రాసిన ఉత్తరాలు డజన్లకొద్దీ వున్నాయి. కాటావేసి చూసుకున్నానేమో, చప్పున గుర్తుపట్టేశాను..."

చలపతి ముఖం విప్పారింది– "అసలేం జరిగిందంటే శేఖరం – వద్దులే! ఇదేమైనా రామాయణమా ఆదినుంచీ చెప్పడానికి సంగ్రహంగానే ముగిస్తాను. అందుబాటులోకి రాని అనుభవం మనిషిని తహతహలాడిస్తుంది. వివశుణ్ణి జేసి వెర్రెక్కిస్తుంది. అందుబాటులోకి వచ్చిన తరువాత అదెంతటి అసామాన్యమైన అనుభవమైనా చప్పున చల్లారిపోయి వూరుకుంటుంది. అందుబాటులో లేని అనుభవానికి సంబంధించిన ఊహలోనుంచీ పుట్టినవాడు కామవర్ధన్! అనుభవం అందుబాటులోకి రాగానే వాడు తారున మరణించాడు! పూర్ ఫెలో! పుబ్బలో పుట్టి మఖలో పోయాడు పాపం. పోతేపోయాడేగానీ వాడు పోవడముందే శేఖరం, అదొక విషాదగాథ! పెళ్ళయిన కొత్తలో మేము బంధువుల వూళ్లన్నిటికీ వెళ్ళామని వ్రాశానుగదూ! ఆ తరువాత సుప్రసిద్ధ టూరింగ్ కేంద్రాలు కొన్నింటికి వెళ్ళాము. వెళ్ళిన ప్రతిచోట ఒక గది తీసుకుని బస చేశాము. రెండు మాసాల సెలవు రెండు క్షణాల్లా గడచిపోయింది. త్రిప్పుటవల్ల ఒళ్ళు దస్సిపోయిన మాట వాస్తవం! మా ఊరికి తిరిగి వచ్చాము. ఎంతగా బద్ధకంగా వున్నా ఆఫీసుకు వెళ్ళక తప్పదు. ఆరోజే డ్యూటీలో జాయిను కావాలి మరి! సాయంకాలం ఆరు గంటలకుగానీ యింటికి తిరిగి రాలేకపోయాను. ఇంట్లో అడుగుపెట్టేసరికి కమురువాసన సోకింది. "ఏమిటమ్మా! కాగితాలు కాలుతున్నట్టున్నా యెందుకూ?" అని మా అమ్మ నడిగాను. "అదేం శోద్యమోరా బాబూ! కాయితాలైతే బాయిలర్ బాగా కాగుతుందట! తట్టెడు కాగితాలతో ఈ పని మొదలెట్టింది అమ్మాయి." "అదేం పని మాలతీ. బొగ్గులు

లేవా ఏమిటి!" అంటూ స్నానాల గదివైపు వెళ్ళాను. మాలతి మాట్లాడలేదు. తట్టలో ఒక పట్టెడు కాగితాలు మాత్రం మిగిలివున్నాయి. చరచరా నా గదిలోకి వెళ్ళి బీరువా తెరిచాను. మాలతిపైన నాకా క్షణాన కోపం వచ్చిన మాట నిజం. కానీ కోపాన్ని వెలిగ్రక్కడానికది తగిన సమయం కాదు. నా వెనువెంటనే లోపలికి వచ్చిన మాలతి అదే బీరువాలోనుంచీ టవల్ తీసుకుంటూ "నీళ్ళు బాగా కాగాయి స్నానం చేద్దురుగానీ రండి' అంటూ ఉపచార వాక్యం పలికింది. నీళ్ళు కాగటంకాదు మసలుతున్నాయి. చన్నీళ్ళు తోడుకునేసరికి పెద్ద చెవుల అండా నిండిపోయింది. ఒళ్ళలసిపోయేలా స్నానం చేశాను. మాలతి తన చేతిమీదుగా వంటచేసి పెట్టడానికదే తొలిరోజు. వంట దివ్యంగా కుదిరింది. సుష్టుగా భోజనం చేశాను. మంచంపై మేను వాల్చడమొక్కటే నాకు తెలుసు. కళ్ళు తెరిచేసరికి భళ్ళున తెల్లవారింది. ఎప్పుడు లేచిందోగానీ మాలతి. ఆపాటికి ముఖం కడుక్కునివచ్చి నిలువుటద్దం ఎదుట తిలకం దిద్దుకుంటోంది. హఠాత్తుగా నా నోటివెంట ఒక ప్రశ్న వెలువడింది. "రాత్రి నేను నిద్రలేచానుగానా మాలతీ" అన్నాను. మాలతి, బదులు చెప్పలేదు. మునిపంటితో పెదవిని నొక్కిపట్టటంద్వారా ఉబికివస్తున్న నవ్వాపుకుంటూ ఆమె "కాఫీ చల్లారిపోతోంది. తొందరగా ముఖం కడుక్కోండి" అంటూ తుర్రున బయటికి జారిపోయింది."

చెప్పడం ముగించి జరిగిన దానితో తనకేమీ సంబంధం లేనట్టు నిశ్శబ్దంగా కూర్చున్నాడు చలపతి. ఎవరు ముందుగా నవ్వుతారోనని పందెం వేసుకున్నట్టుగా వుంది పరిస్థితి. చివరకు నేను ఓడిపోయాను.

❖ 'వాణి', – సెప్టెంబర్, 1975. ❖